క్లుప్తంగా

గురుకుల ప్రవేశ పరీక్షకు గడువు పెంపు

చేజర్ల: మండలంలోని ఆదూరుపల్లి అంబేడ్కర్ బాలయోగి బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి ప్రవేశ పరీక్ష గడువు పొడిగించినట్లు ప్రిన్సిపల్ బి శైలజా కుమారి శనివారం తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు ఆన్‌లైన్ లేదా తమ పాఠశాలలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 31వ వరకు పొడిగించారని తెలిపారు. వివరాలకు 7675875222 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

సంగం: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపల్ వై మహాలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత ఈ నెల 24వ తేదీ వరకు గడువు ప్రకటించారని, తాజాగా 31వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈఓపీఆర్డీగా నరసయ్య



బాధ్యతలు చేపట్టిన నరసయ్య

ఉదయగిరి: ఉదయగిరి మండల ఇన్‌చార్జి ఈఓపీఆర్డీగా నరసయ్య శనివారం బాధ్యతలు చేపట్టారు. స్థానిక పంచాయతీ ఈఓగా పనిచేస్తున్న ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ ఈఓపీఆర్డీగా పనిచేస్తున్న మల్లికార్జున దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో ఇన్‌చార్జిగా నరసయ్యను నియమించినట్లు ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ తెలిపారు.

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక

ఉదయగిరి: ఎన్ఎంఎంఎస్ ఉపకార వేతనాలు పొందేందుకు మండలంలోని వెంగళరావునగర్, గడ్డంవారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన డి.కార్తీక్, కె.లక్ష్మీ ఎంపికైనట్లు ఆయా పాఠశాలల హెచ్ఎంలు నూర్జహాన్, శీనయ్య శనివారం తెలిపారు. వీరికి 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఏడాదికి రూ.12 వేల వంతున జాతీయ ఉపకార వేతనాలు అందుతాయన్నారు. అనంతరం విద్యార్థులను హెచ్ఎంలు, ఉపాధ్యాయులు అభినందించారు.

సకాలంలో ఇంటి పన్నులు చెల్లించండి



కమిషనర్ ఫణికుమార్

అల్లూరు: సకాలంలో ఇంటి పన్నులను చెల్లించి అల్లూరు నగర పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ ఫణికుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 2022–23 ఆర్థిక సంవత్సరానికి చెల్లించాల్సిన ఇంటి పన్నుల బకాయిలను మార్చి 31వ తేదీలోగా చెల్లించాలన్నారు. తద్వారా వడ్డీ రాయితీ పొందే అవకాశం ఉందన్నారు. నగర పంచాయతీ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.


సచివాలయం ఆకస్మిక తనిఖీ



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కావలి డీడీఓ కనకదుర్గాభవాని

కావలి: మండలంలోని చలంచర్ల సచివాలయాన్ని శనివారం కావలి డివిజనల్ అభివృద్ధి అధికారి కనకదుర్గాభవాని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె సచివాలయంలోని పలు రికార్డులు పరిశీలించారు. ఆయుష్మాన్ భారత్, ఇతర సంక్షేమ పథకాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. తడి చెత్త, పొడి చెత్తను ఏ విధంగా వేరు చేయాలి, సేకరించిన చెత్త ద్వారా వర్మీకంపోస్టు తయారు చేయడానికి సంబంధించి పలు సూచనలు జారీ చేశారు. ఆధార్ స్పెషల్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటసుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి శ్యామ్ సుందర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో పోషకాలు



సంగం: చిరు ధాన్యాలతో మెండుగా పోషకాలు లభిస్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి తెలిపారు. సంగంలోని తిరుమనతిప్ప అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ్ పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నేతలు కంటాబత్తిన రఘునాథ్ రెడ్డి, వేణు మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు మంచి పౌష్టికాహారం అందించాలని, మంచి పోషకాలు కలిగిన ఆహారం అందించాలంటే అది చిరుధాన్యాల్లోనే లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశలు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న జగనన్న

• వార్డుల్లో ఆసరా సంబరాలు



ఆత్మకూరు మున్సిపల్ 19వ వార్డు పరిధిలో వైఎస్సార్ సంబరాల సమావేశం

ఆత్మకూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక మహిళల పొదుపు ఖాతాల్లో నగదును జమ చేస్తూ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని పలువురు వక్తలు పేర్కొన్నారు. వైఎస్సార్ ఆసరా పథకంలో భాగంగా మూడో విడత పొదుపు మహిళల ఖాతాల్లో నగదు జమ కానుండడంతో మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో మెప్మా సిబ్బంది, ఆయా వార్డుల కౌన్సిలర్లతో శనివారం అవగాహన సమావేశాలు నిర్వహించారు. 20వ వార్డు పరిధిలో కౌన్సిలర్ సూరా భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పొదుపు సిబ్బంది మాట్లాడుతూ వార్డు పరిధిలో 16 గ్రూపులకు రూ.35 లక్షల ఆసరా పథకంలో నగదు వారి వ్యక్తిగత ఖాతాల్లో జమ కానుందని వివరించారు. 19 వార్డు పరిధిలో కౌన్సిలర్ కొండా స్వరూపరాణి ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సమావేశంలో గ్రూపులకు వచ్చిన నగదు వివరించి ఆయన నగదును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొండా వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు. 7 వార్డు పరిధిలో కౌన్సిలర్ సయ్యద్ నౌషాద్ బేగం ఆధ్వర్యంలో వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించారు. 3 విడతల్లో వార్డు పరిధిలోని గ్రూపులకు సుమారు రూ.98 లక్షలకుపైగా పొదుపు ఖాతాల్లో జమ అయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ జమీర్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మేకపాటి ద్రోహి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వింజమూరు: వైఎస్సార్‌సీపీకి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ద్రోహం చేశారని స్థానిక పార్టీ నాయకులు విమర్శించారు. వింజమూరు ఆర్అండ్‌బీ బంగ్లాలో మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి ఎమ్మెల్యే మేకపాటి ద్రోహం చేస్తూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీకి మద్దతివ్వడం దురదృష్టకరమన్నారు. తాము ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి చేసిన ద్రోహాన్ని ఎప్పటికీ మరిచిపోమన్నారు. తామంతా వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తామని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పని చేస్తామన్నారు. ఎమ్మెల్యే మేకపాటికి దూరంగా ఉంటామన్నారు. మండలంలోని కార్యకర్తలంతా కూడా జగన్‌మోహన్‌రెడ్డి వెంటే నడుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు రేవునూరు శ్రీనివాసులురెడ్డి, సొసైటీ అధ్యక్షుడు జూపల్లి రాజారావు, మాజీ మండల కన్వీనరు మద్దూరు లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు విజయక్ష్మారెడ్డి, సర్పంచ్ ఎస్.సుజన, కొండపల్లి రమేష్, గోవిందరెడ్డి, వెంకటేశ్వర్లు, అన్నపురెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రతిష్టాత్మకంగా గడప గడపకు మన ప్రభుత్వం



సమీక్షలో మాట్లాడుతున్న ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ

సోమశిల: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నారని అనంతసాగరం ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ తెలిపారు. శనివారం అనంతసాగరం 1, 2 సచివాలయాల పరిధిలోని వలంటీర్లు, అధికారులతో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంపై ఎంపీడీఓ మధుసూదన్ ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి త్వరలో సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలను చేపడుతారన్నారు. వలంటీర్లు విధిగా వారి పరిధిలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంపై ఎంపీడీఓ పలు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు ప్రదీప్, సర్పంచ్ బొర్రా శోభ, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గడపగడపకు మన ప్రభుత్వంపై సమీక్ష

చేజర్ల: మండలంలోని ఆదూరుపల్లి గ్రామ సచివాలయంలో గడపగడపకు మన ప్రభుత్వంపై శనివారం ఎంపీడీఓ విజయలలిత సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా రేషన్ కార్డులు, వృద్ధాప్య పింఛన్, ఇళ్ల స్థలాల విషయం చర్చించారు. ఇళ్ల స్థలాలకు కేటాయించిన స్థలం హైవే నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో వేరే చోట కేటాయించాలని లబ్ధిదారులు కోరుతున్నారన్నారు. త్వరలో అధికారులతో మాట్లాడి పరిష్కార మార్గం చూపుతామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ మాధవయ్య, సర్పంచ్ నారాయణమ్మ, పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారం అందేలా చర్యలు



దాసరిఅగ్రహారంలో దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ రామిరెడ్డి, ఏఓ శైలజ

జలదంకి: మండలంలో అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం అందేలా చర్యలు చేపడుతున్నట్లు కలిగిరి ఏడీఏ రామిరెడ్డి తెలిపారు. శనివారం ఆయన మండలంలోని దాసరిఅగ్రహారం, బ్రాహ్మణక్రాక, కృష్ణాపాడు గ్రామాల్లో దెబ్బతిన్న వరి, పత్తి పంటలను పరిశీలించారు. వరి పంట వాలిపోవడంతో పాటు గింజలు నీటిలో రాలిపోయాయన్నారు. కొందరు రైతులు ఆరబెట్టుకున్న ధాన్యం తడిచిపోయినట్లు గుర్తించామన్నారు. పత్తి పంటలో కొమ్మలు విరగడంతో పాటు ఆకులు రాలిపోయాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ బి.శైలజ, ఏఈఓ మునెమ్మ, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బందితో సమన్వయ సమావేశం



మాట్లాడుతున్న ఎస్ఆర్‌పీ అచ్యుత్‌రావు


సీతారామపురం: ఉపాధి హామీ కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, ప్రజాప్రతినిధులతో సామాజిక తనిఖీ బృందం సభ్యులు శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్‌పీ అచ్యుత్‌రావు మాట్లాడుతూ 2021–22 సంవత్సరానికి మండలంలోని 14 పంచాయతీల్లో సుమారు రూ.9 కోట్ల ఉపాధి పనులు జరిగాయన్నారు. వీటిలో రూ.4.80 కోట్లు లేబర్, రూ.4.20 కోట్లు మెటీరియల్ పేమెంట్‌గా ఉందన్నారు. డీఆర్పీలు గ్రామాల్లో పారదర్శకంగా తనిఖీలు నిర్వహించి నివేదికలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సుభాషిణి, ఈసీ సువార్తయ్య, ఉపాధి సిబ్బంది, డీఆర్పీలు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్



కావలి: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని గురుకుల పాఠశాలల ప్రాజెక్ట్ అధికారిణి డాక్టర్ మందా రాణి తెలిపారు. శనివారం ముసునూరు ఏపీ గురుకుల గిరిజన బాలికల పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి ఆందోళనలకు గురికాకుండా పరీక్షలు రాసి మంచి మార్కులతో విజయం సాధించాలని కోరారు. ప్రణాళికను ఏర్పర్చుకుని దానికి అనుగుణంగా అభ్యసన చేసి మంచి ఫలితాలను సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారిణి పరిమళ, పాఠశాల ప్రిన్సిపల్ శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.


తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి



ఐజాక్‌ప్రవీణ్

ఉదయగిరి: మండలంలోని సచివాలయ, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ సూచించారు. ఆయన శనివారం కార్యదర్శులతో సమీక్షించారు. గ్రామాల్లో పైపులైన్‌లు లీకేజీలు ఉంటే వెంటనే గుర్తించి మరమ్మతులు చేయించాలన్నారు. ఆధార్ అప్‌డేట్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఈ నెల చివరి నాటికి నూరు శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలన్నారు. జేఎస్ఎస్ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సచివాలయాల సేవలను విస్తృత పర్చాలన్నారు. ఈఓపీఆర్డీ నరసయ్య పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



మర్రిపాడు: మండలంలోని పడమటినాయుడుపల్లిలో శనివారం రాత్రి ముస్లింలకు గ్రామానికి చెందిన యువకులు ఇఫ్తార్ విందు ఇచ్చారు. రంజాన్ ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలకు విందు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ బాషా, షాహుల్, ముజిమిల్, నబీ తదితరులు ఉన్నారు.

అనారోగ్యంతో వీఆర్వో మృతి



వీఆర్వో శ్రీనివాసులు

బిట్రగుంట: బోగోలు మండలం విశ్వనాథరావు పేట వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న దాసరి శ్రీనివాసులు (52) అనారోగ్యంతో శనివారం వేకువజామున మృతి చెందారు. కావలి మండలం పూలదొరువు గ్రామానికి చెందిన శ్రీనివాసులు విశ్వనాథరావుపేట వీఆర్వోగా విధులు నిర్వహిస్తూ ఇటీవల అనారోగ్యానికి గురయారు. శుక్రవారం అర్ధరాత్రి నెల్లూరుకు తరలిస్తుండగా మృతి చెందాడు. బోగోలు తహసీల్దార్ లక్ష్మీనారాయణ, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది శ్రీనివాసులు మృతదేహానికి నివాళులర్పించారు. అంత్యక్రియలకు తక్షణ సాయం కింద ప్రభుత్వం నుండి అందిన రూ.25 వేల వీఆర్వో కుటుంబ సభ్యులకు అందించారు.

30 నుంచి కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాలు

వింజమూరు: మండలంలోని గుండెమడకలలో ఉన్న కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 30 నుంచి నిర్వహిస్తున్నట్లు ఆ దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త చీమల వెంకటరెడ్డి తెలిపారు. 30న అశ్వవాహన సేవ, 31న శేషవాహన సేవ, ఏప్రిల్ 1న హనుమంతుసేవ, 2న గరుడసేవ, 3న గజవాహన సేవ, 4న కల్యాణోత్సవం, వసంతోత్సవం నిర్వహిస్తామన్నారు. 5న ఏకాంతసేవ, 19న పదహారు రోజుల పండగ నిర్వహిస్తామన్నారు. ప్రతి రోజూ ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

28న టీవీఎస్ మోపెడ్ వేలం

కలిగిరి: కలిగిరి సెబ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమ మద్యం అమ్మకాల కేసులో పట్టుబడిన టీవీఎస్ మోపెడ్ వాహనాన్ని ఈ నెల 28న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు కలిగిరి సెబ్ సీఐ బి.అశోక్‌కుమార్ శనివారం తెలిపారు. ప్రభుత్వం వాహన ధరను రూ.10 వేలుగా నిర్ణయించినట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు రూ.1000 దరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని ఆయన సూచించారు.

అనాథాశ్రయంలో వైద్యపరీక్షలు



అనాథాశ్రయంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సీతారామపురం: మండలంలోని బసినేనిపల్లి అనాథాశ్రయంలో 36 మంది అనాథలకు శనివారం ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగరు, ఆయాసం, మూర్ఛ తదితర పరీక్షలు నిర్వహించి నెల రోజులకు సరిపడా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం విశ్రాంతమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



కలిగిరి: కలిగిరిలోని కస్తుర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 10వ తరగతి విద్యార్థులకు సమరసతా సేవా ఫౌండేషన్ సభ్యుడు కోట వెంకటరెడ్డి శనివారం పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ధర్మప్రచారక్ కర్రా భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ సభ్యులు రంగారావు, మాధవరెడ్డి, ప్రిన్సిపల్ సుప్రియ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాటర్ కూలర్ వితరణ



ఉదయగిరి: పట్టణంలోని పంచాయతీరాజ్ సబ్ డివిజన్ డీఈ కార్యాలయానికి జీఎంకే ట్రస్ట్ అధినేత, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి శనివారం వాటర్ కూలర్‌ను అందజేశారు. పంచాయతీరాజ్ డీఈ సుబ్బారెడ్డి కార్యాలయంలో ఉద్యోగులు, ప్రజల సౌకర్యార్థం కూలింగ్ వాటర్ సౌకర్యం కల్పించాలని మాలకొండయ్య చౌదరి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి ట్రస్ట్ ఆధ్వర్యంలో వాటర్ కూలర్ వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాసరాజు, పంచాయతీ కార్యదర్శి అమర్‌నాథ్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ నవాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 81 మంది గైర్హాజరు

ఆత్మకూరు: ఆత్మకూరులోని నాలుగు కేంద్రాల్లో శనివారం జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షకు మొత్తం 81 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వాసుబాబు తెలిపారు. ప్రభుత్వం జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 285 మందికి 50 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 252 మందికి పది మంది, షిరిడీ సాయిరాం కళాశాల పరీక్ష కేంద్రంలో 289 మందికి 11 మంది, జిల్లా పరిషత్ బాలికల పాఠశాల కేంద్రంలో 253 మందికి పది మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయన వివరించారు.

అడవులను సంరక్షించాలి

• డిప్యూటీ రేంజర్ రవీంద్రబాబు



మాట్లాడుతున్న డిప్యూటీ రేంజర్ రవీంద్రబాబు

మర్రిపాడు: మండలంలో అడవులను సంరక్షించుకోవాలని డిప్యూటీ రేంజర్ రవీంద్రబాబు అన్నారు. మండలంలోని చుంచులూరులో శనివారం వన్యప్రాణి, ఎర్రచందనం సంరక్షణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రవీంద్రబాబు మాట్లాడుతూ వేసవిలో అడవుల్లో నిప్పులు పడి చెట్లు పూర్తిగా కాలిపోతున్నాయని, వాటిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అడవుల్లో మంటలు రేగడం వల్ల వన్యప్రాణులు అంతరించిపోతున్నాయన్నారు. అడవిలో నివసించే జంతువుల కోసం వేసవి కాలంలో నీటి తొట్లెలను ఏర్పాటు చేసి నీటిని కూడా అందిస్తామన్నారు. అడవుల సమీపంలో ఉన్న గ్రామాల్లో వన సంరక్షణ సమితిలు పర్యవేక్షించాలని కోరారు. ఎర్రచందనం చెట్లను కాపాడాలని ఆయన కోరారు. అనంతరం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. మర్రిపాడు వైద్యాధికారి డాక్టర్ గోపినాథ్ రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫడ్స్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ రమణయ్య, బీట్ ఆఫీసర్లు శ్రీరామరాజు, శివకుమార్, సంపత్, సాయికృష్ణ, వనసంరక్షణ సమితి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోషకాహార కేంద్రాలుగా అంగన్‌వాడీలు



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ రాజేశ్వరి

అల్లూరు: పూర్తిస్థాయి పోషకాహార కేంద్రాలుగా అంగన్‌వాడీ కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం తీర్చిదిద్దుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎ.రాజేశ్వరి తెలియజేశారు. శనివారం అల్లూరు నగర పంచాయతీ చింతగుంటకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలు, బాలింతలు, గర్భిణులు, కిషోర బాలికల్లో రక్తహీనత సమస్యలు ఉండకూడదన్నారు. మందుల వినియోగం అవసరం లేకుండా పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనత అధిగమించవచ్చన్నారు. చిరుధాన్యాల ఆహారం తీసుకుంటే ఎటువంటి అనారోగ్య సమస్యలు దరిచేరవన్నారు. తాజా పండ్లు, కూరగాయలు, మాంసాహారం, గుడ్లు, ఆకు కూరలు, తృణధాన్యాలు, చిరుధాన్యాలను ఆహారంలో భాగంగా తీసుకోవాలన్నారు.

చెత్తతో సంపద సృష్టి



కరటంపాడులో జరిగిన శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న ఆత్మకూరు ఎంపీడీఓ శ్రీనివాసులు

ఆత్మకూరురూరల్: గ్రామ పంచాయతీల స్థాయిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన చెత్త సంపద తయారీ కేంద్రాల్లో రసాయన రహిత ఎరువులు తయారు చేసి రైతులకు విక్రయించడం ద్వారా గ్రామ పంచాయతీలు ఆర్థిక స్వావలంబన సాధించవచ్చని ఆత్మకూరు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని కరటంపాడులో రెవెన్యూ సబ్ డివిజన్ స్థాయిలో ఏర్పాటు చేసిన ఎల్‌టీసీ కేంద్రంలో శనివారం కలువాయి, సంగం మండలాల్లోని చింతలాత్మకూరు, కుల్లూరు, కోలగట్ల, తరుణవాయి, తదితర గ్రామ పంచాయతీల ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది అధికారులకు పారిశుద్ధ్యం అమలుపై నిర్వహించిన శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడారు. స్థానిక సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, పాలకవర్గాల సభ్యులు ప్రత్యేక శ్రద్ధ చూపి పారిశుద్ధ్య కార్యక్రమాలను చిత్తశుద్ధితో అమలు చేయాలన్నారు. తద్వారా ప్రజల ఆరోగ్యానికి భరోసా ఏర్పడుతుందని వివరించారు. ప్రతి సచివాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పారిశుధ్యం అమలుకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. జిల్లా రిసోర్స్ చల్లా ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా కరటంపాడులో ఆత్మకూరు రెవెన్యూ డివిజన్‌లోని పది మండలాలకు చెందిన గ్రామ పంచాయతీలకు చెత్త సంపద తయారీ కేంద్రం నిర్వహణ, పారిశుధ్య కార్యక్రమాలు అమలు తదితర అంశాలపై రోజుకు 50 మంది చొప్పున అధికారులు, ప్రజాప్రతినిధులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. శిక్షణ పొందిన వారు తమ గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు పక్కాగా అమలు చేసి ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో కలువాయి ఎంపీడీఓ అప్పాజీ, కలువాయి, సంగం, ఆత్మకూరు మండల విస్తరణాధికారులు నారాయణ, శ్రీకాంత్, ఉషారాణి, స్థానిక సర్పంచ్ రేవతి, పంచాయతీ కార్యదర్శి అంకయ్య, ఆయా మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ, వెటర్నరి సహాయకులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు పాస్టర్ల కృతజ్ఞతలు



మాట్లాడుతున్న క్రైస్తవ నాయకులు

అల్లూరు: దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించేందుకు అసెంబ్లీలో తీర్మానాన్ని చేసి కేంద్రానికి సిఫార్సు చేయడం ఎంతో సంతోషదాయకమని పలువురు పాస్టర్లు తెలిపారు. స్థానిక కావలి ప్రెస్‌క్లబ్‌లో శనివారం కావలికి చెందిన పాస్టర్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా పాస్టర్లు మాట్లాడుతూ దళిత క్రైస్తవుల ఎప్పటి నుంచో ఎస్సీ హోదా కోసం పోరాడుతున్నామని, ఎన్నడూ ఏ ముఖ్యమంత్రి కూడా ఈ సమస్యను పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. మొట్టమొదటి సారిగా తమ సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమ మద్దతు ఉంటుందని కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రైస్తవ యువజన ప్రధాన కార్యదర్శి పాడేటి థామస్, క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు బోగిరి విన్సెంట్, కావలి పాస్టర్ ప్రెసిడెంట్ ఆకుల ఏసుబాబు, వైస్ ప్రెసిడెంట్ ఈదురు జైపాల్, నాయకులు వైటీ రవి తదితరులు పాల్గొన్నారు.

సత్వరమే సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన వినతులతో పాటు సర్వే ద్వారా గుర్తించిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు కృషి చేయాలని ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. మండలంలోని రామస్వామిపల్లి సచివాలయంలో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రామస్వామిపల్లిలో 259 సమస్యలు అధికారికంగా గుర్తించారని, వీటిలో ఇప్పటికీ 144 సమస్యలు పెండింగ్‌లో ఉండడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి సమస్యకు పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఏ కారణం చేతనైనా పరిష్కరించలేని సమస్యలు ఉంటే ఆ వివరం అర్జీదారులకు తెలియజేయాలన్నారు. అనంతరం ఆత్మకూరు తహసీల్దారు లక్ష్మీనరసింహం, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓ కిషోర్ తదితరులు తమ తమ శాఖల పరిధిలోని జరుగుతున్న పురోగతితో పాటు తాము పరిష్కరించిన సమస్యల వివరాలు తెలియజెప్పారు. కార్యక్రమంలో వీఆర్ఓ రమణయ్య, పంచాయతీ కార్యదర్శి కార్తీక్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



మాట్లాడుతున్న సీడీపీఓ లావణ్య

ఉదయగిరి: పౌష్టికాహారం ద్వారానే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీడీపీఓ పచ్చవ లావణ్య అన్నారు. ఉదయగిరిలోని షాదీ మంజిల్‌లో శనివారం ఉదయగిరి ప్రాజెక్ట్ పరిధిలోని మర్రిపాడు, సీతారామపురం, వరికుంటపాడు, ఉదయగిరి మండలాలకు సంబంధించి పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహార ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో బరువు తక్కువగా ఉన్న పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలు వివరించాలన్నారు. సంపూర్ణ ఆరోగ్యంపై వైద్యురాలు శివకల్పన వివరించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్, అనంతసాగరం సీడీపీఓ పద్మావతి, ఆరోగ్య బోధకుడు వెంకటసుబ్బయ్య, సూపర్‌వైజర్లు షాను, తేజస్విని, శారద, ఐకేపీ సీసీలు శ్రీనివాసులు, రత్నకుమారి పాల్గొన్నారు.